క్లుప్తంగా

నూకాలమ్మకు వెండి సమర్పణ



నూకాలమ్మను దర్శించుకుని, వెండిని ఆలయ కమిటీకి అందజేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మ వారికి వెండి చీర తయారు చేసే కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా హైద్రాబాద్‌కు చెందిన పసుమర్తి భరద్వాజ, గాయత్రీదేవి దంపతులు 10 తులాల వెండి, తాళ్లూరి శ్రీరామ చౌదరి, నాగమణి దంపతులు 5 తులాల వెండి అమ్మవారి చీర నిమిత్తం అందజేశారని తెలిపారు. ఆలయ కమిటీ, నూకాంబిక సేవాబృందం సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

జెడ్పీ హైస్కూల్‌కు ఫర్నిచర్ బహూకరణ



దాతలు బహూకరించిన రిలాక్స్‌డ్ త్రీ సీటర్ చైర్‌లు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్‌కు ఫర్నిచర్ సమకూరింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తున్న సీహెచ్ మణికుమార్, విజయలక్ష్మి దంపతులు రూ.50 వేలు విలువ చేసే రిలాక్స్‌డ్ త్రీ సీటర్ రెండు చైర్లను అందజేశారు. అలాగే ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన సోషల్ స్కూల్ అసిస్టెంట్ ఎస్‌వీ రమణ రూ.8 వేలు విలువ చేసే రివాల్వింగ్ ఆఫీస్ చైర్‌ను బహూకరించారు. పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ ఎంవీ ప్రకాష్, స్టాఫ్ సెక్రటరీ టి.జగదీష్, సీనియర్ ఉపాధ్యాయులు చిలుకూరు సుధాకర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



పేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఆటో కన్సల్టెన్సీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

జంగారెడ్డిగూడెం: ఆటో కన్సల్టెన్సీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొయ్యలగూడెం గ్రామంలో నిరుపేద కుటుంబానికి శుక్రవారం సహాయం అందించింది. కొయ్యలగూడేనికి చెందిన మూర్తి అనే నిరుపేద ప్రమాదవశాత్తు మరణించాడు. దీంతో తమ వంతు సాయంగా అసోసియేషన్ సభ్యులు సేకరించిన రూ.30 వేలు జంగారెడ్డిగూడెం ప్రముఖులు చామర్తి శ్రీరాములు, పాలపర్తి శ్రీనివాస్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందించినట్లు అసోసియేషన్ సభ్యులు పోలు మాల్యాద్రిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆనందకుమార్, వెంకటరావు, వెంకట సుబ్బయ్య, మద్దిపాటి శ్రీనివాస్, సీహెచ్ విగ్నేష్, ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పౌష్టికాహార మాసోత్సవాలు



పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు కొనసాగుతున్నాయి. ఐసీడీఎస్ పరిధిలోని తాడువాయి కోడ్‌నెంబర్ 87 అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ 7వ పోషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం గురించి తల్లులకు, బాలింతలకు, గర్భిణులకు వివరించారు. ఈ సందర్భంగా సీడీపీవో బ్యూలా మాట్లాడుతూ గ్రోత్ మానిటరింగ్ ద్వారా తక్కువ బరువున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.లక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ తేజస్విని, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదావరి వరద

పోలవరం రూరల్: గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. నదీ పరివాహక ప్రాంతంలో నదిలోకి చేరే నీరు తగ్గుతుండటంతో వరద ప్రవాహం క్రమేపీ తగ్గుతోంది. భద్రాచలం వద్ద నీటి మట్టం 42.10 అడుగులకు చేరుకుంది. అయితే దిగువన స్పిల్‌వే వద్ద స్వల్పంగా నీటిమట్టం పెరుగుతోంది. 32.560 మీటర్లకు నీటిమట్టం చేరకుంది. స్పిల్‌వే నుంచి 9.76 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతుంది.

సంక్షోభంలో సంక్షేమం



కామవరపుకోట శివారు పాతూరు రోడ్లో పాత భవనంలో నిర్వహిస్తున్న బాలుర ఎస్సీ సంక్షేమ వసతి గృహం



కొయ్యలగూడెం: బీసీ బాలుర హాస్టల్లో ఏ విధమైన సౌకర్యం లేని పడక గది



కొయ్యలగూడెం: ప్రభుత్వ హాస్టల్‌లో అధ్వానంగా ఉన్న కిచెన్ రూమ్



కొయ్యలగూడెం: మూలనపడేసిన విద్యార్థులు వాడే ట్రంకు పెట్టెలు



కొయ్యలగూడెం: మూలనపడేసిన విద్యార్థుల దరఖాస్తులు

- అధ్వానంగా హాస్టళ్ల నిర్వహణ
- చాలీచాలని గదులు, అరకొర సౌకర్యాలతో అవస్థలు
- అగమ్యగోచరంగా విద్యార్థుల భవిత

కొయ్యలగూడెం: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో వసతులు అధ్వానంగా ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలీచాలని గదులతో, అరకొర సౌకర్యాలతో నానా అవస్థలు పడుతున్నారు. హాస్టళ్ల నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. మండల వ్యాప్తంగా ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలు గతంలో 8 ఉండగా ఇందులో 3 హాస్టళ్లు మూతపడ్డాయి. దీనికి కారణం విద్యార్థులు లేరని అధికారులు పేర్కొన్నారు. అయితే వాస్తవానికి ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న అధికారులు విధుల నిర్వహణకు తీరుబడి లేక హాస్టల్ అవసరం లేదని ప్రభుత్వానికి నివేదికలు పంపడంతోనే అవి మూతపడ్డాయని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. అంగాలగూడెంలోని బీసీ సంక్షేమ బాలుర కళాశాల హాస్టల్‌లో ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకున్నప్పటికీ తమకు అవకాశం కల్పించలేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. గత సంవత్సరం 60 మందికి పైగా విద్యార్థులు ఉండగా ఇప్పుడు కేవలం 20 మంది మాత్రమే ఉన్నారని స్థానికులు పేర్కొన్నారు. విద్యార్థులు దుప్పట్లు లేక నేలపైనే పడుకునే దుస్థితి నెలకొంది. అదే విధంగా పరింపూడిలోని బాలికల కళాశాల హాస్టల్‌లో కూడా 80 మందికి పైగా ఉండే విద్యార్థులు నేడు 20 మందికి పరిమితమయ్యారు. ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న వార్డెన్లు విద్యార్థులకు వసతి సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఒక్కో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ అధికారికి 4 నుంచి 5 చోట్ల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం వలన విద్యార్థుల సంరక్షణ విషయంలో నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతుంది. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ వసతి గృహాలలో చేసుకున్న దరఖాస్తులు బుట్టదాఖలు అవుతున్నాయి. కొన్నిచోట్ల అద్దె భవనాలకు బకాయిలు చెల్లించకపోవడం వలన వివాదంతో మూతపడగా విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారింది.

చాలీచాలని గదులతో అవస్థలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గురుకుల బాలికల పాఠశాలలో చాలీచాలని గదులతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ 646 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులు భోజనం చేసేందుకు కూడా సరైన సదుపాయం లేదు. మరిన్ని భవనాలు నిర్మించి, సౌకర్యాలు కల్పించాలి. వాతావరణంలో మార్పుల కారణంగా విద్యార్థులు జ్వరాల బారిన పడుతుండగా వారిని ఏరియా ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. సెక్యూరిటీ, పారిశుధ్య సిబ్బందికి ప్రస్తుతం ఇస్తున్న రూ.8 వేల జీతం చాలక నానా ఇబ్బందులు పడుతుంటే దీనికి తోడు సెక్యూరిటీ సిబ్బందికి 4 నెలలుగా జీతాలు రావడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం జీతాలు పెంచి ఆదుకోవాలని కోరుతున్నారు. అలాగే జంగారెడ్డిగూడెం సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌లో 680 మంది ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఉన్నారు. హాస్టల్ ఆరు బయట ఖాళీ స్థలంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. వీటిపై మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

పెచ్చులూడిన పాత భవనాలు

కామవరపుకోట: మండలంలో మూడు సంక్షేమ వసతి గృహాలకుగాను బాలికల వసతి గృహం ప్రభుత్వ భవనంలో నిర్వహిస్తూ ఉండగా, బాలుర ఎస్సీ, బీసీ వసతి గృహాలను సుమారు 20 ఏళ్లగా పాత భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఎస్సీ వసతి గృహంలో 90 మంది విద్యార్థులు ఉండగా, బీసీ వసతి గృహంలో 45 విద్యార్థులు ఉన్నారు. ఈ పాత భవనాలలో చాలీచాలని గదులతో ఒకే గదిలో పదిమందికి పైగా విద్యార్థుల ఉంటూ ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు వర్షాకాలం వచ్చిందంటే గదుల్లో వర్షపు నీరు చేరటంతో నానా అవస్థలు పడుతున్నారు. ఈ హాస్టల్లో భవనాలకు సరైన తలుపులు, కిటికీలు కూడా లేవు. మరమ్మతుల సమయంలో ఈ పాత భవనాల పైకప్పు రేకులు వేయడం వలన రాత్రి సమయంలో వర్షం కురిస్తే, రేకుల శబ్దానికి బిక్కుబిక్కుమంటూ నిద్రిస్తున్నారు. ఈ వసతి గృహాల్లో సరైన మంచినీటి సదుపాయం కూడా లేదు.

దెబ్బతిన్న మరుగుదొడ్ల తలుపులు

చింతలపూడి: గిరిజన గురుకుల పాఠశాలలో 142 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. విద్యార్థులు భోజనం చేసేందుకు డైనింగ్ హాల్ లేకపోవడంతో విద్యార్థులు గుంపులు గుంపులుగా హాల్లోనే భోజనాలు చేస్తున్నారు. ఇక్కడ మరుగుదొడ్ల తలుపులు పాడయ్యాయి. వాటిని ఇంతవరకు మరమ్మతులు చేయలేదు. ఇక్కడ పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీతాలు సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో జీతాల బకాయిలు చెల్లించడంతోపాటు తమకు జీతాలు పెంచాలని పారిశుధ్య కార్మికులు కోరుతున్నారు.

> **కొత్త భవనాలు నిర్మించాలి**
>
> 
>
> వర్షాకాలం వచ్చిందంటే పాత భవనాల్లోని హాస్టళ్లలో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ హాస్టళ్లలో సరైన మంచినీటి సదుపాయం కూడా లేదు. ఇక్కడ సౌకర్యాలు సరిగా లేక విద్యార్థులు చేరాలంటే ఆసక్తి చూపడం లేదు. కనుక పేద విద్యార్థులకు మేలు చేసే విధంగా అధికారులు స్పందించి నిధులు కేటాయించి కొత్త భవనాలు నిర్మించాలి.
>
> – బొల్లు వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీ కామవరపుకోట

అదేవిధంగా గురుకుల పాఠశాల విద్యార్థులకు కూరగాయలు, పచారీ సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్‌కు కూడా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఏలూరు డీఆర్‌సీ ఏడీఏ లలిత సుధ

చింతలపూడి: వ్యవసాయంలో పెరుగుతున్న ఖర్చులు తగ్గించుకోవడానికి రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏలూరు డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ లలిత సుధ సూచించారు. మండలంలోని రాఘవాపురంలో శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ లలిత సుధ మాట్లాడుతూ ప్రస్తుతం రసాయనాల వాడకం వలన భూసారం తగ్గిపోతుందని, దీంతో పెట్టుబడి ఖర్చులు పెరిగి పోయాయన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న వాతావరణ మార్పుల కారణంగా ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె మీనాకుమారి ,ఆర్ఎస్‌కె అసిస్టెంట్ శివ, వెంకన్నబాబు, రైతులు పాల్గొన్నారు.

రేపు సూర్య ఘర్ యోజన స్కీంపై అవగాహన సదస్సు

జంగారెడ్డి గూడెం: ఈ నెల 8 ఆదివారం ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన స్కీంపై విద్యుత్ వినియోగదారులు, సోలార్ కంపెనీ ప్రతినిధులతో అవగాహన సదస్సు నిర్వహిస్తామని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రాధాకృష్ణ తెలిపారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డులో ఆలపాటి కల్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. రూ.1180 రిజిస్ట్రేషన్ ఫీజు, ఆధార్ కార్డుతో ఈ స్కీం ప్రక్రియ మొదలవుతుందన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

ద్వారకాతిరుమల: రైతులు భూసార పరీక్షలను తప్పనిసరిగా చేయించాలని, వాటి ఆధారంగా మాత్రమే ఎరువులను వినియోగించాలని డీఆర్‌సీ ఏడీఏ పి.లలిత సుధా సూచించారు. మండలంలోని పి.కన్నాపురంలో వ్యవసాయాధికారులు శుక్రవారం ఎరువుల వినియోగంపై రైతులకు ఒక రోజు శిక్షణ, పొలాల సందర్శన వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా లలిత సుధా మాట్లాడుతూ ఎరువులు, క్రిమి సంహారక మందులు అధికంగా వినియోగించడం వలన కాలుష్యం పెరిగి, ప్రకృతిలో అనేక మార్పులు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎ.దుర్గా రమేష్, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ ఎల్.జ్యోతి, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సమస్యలు పరిష్కరించండి



ధర్నా నిర్వహిస్తున్న సీపీఐఎంఎల్ నాయకులు

వేలేరుపాడు: పెద్దవాగు ప్రాజెక్టు వరద బాధితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ, సీపీఐఎంఎల్ మాస్ లైన్ వేలేరుపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో వేలేరుపాడు తహసిల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం మండల స్పెషల్ ఆఫీసర్ రాముకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి ఎస్కే గౌస్ మాట్లాడుతూ వరదలు వచ్చి మూడు నెలలు కావస్తున్నా ఇంత వరకు గ్రామాల్లో మంచి నీటి సౌకర్యం అందించలేదని, కనీసం గ్రామాల్లో మట్టి రోడ్లు కూడా పోయలేదని, తక్షణమే వరద బాధితులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గడ్డాల ముత్యాలరావు, డివిజన్ నాయకులు కరటం వీరాస్వామి, కరటం ముత్యారావు, మేడేపల్లి సర్పంచ్ కట్టం రాంబాబు, ఎంపీటీసీ తుర్రం తమ్మయ్య, మేడేపల్లి ఉప సర్పంచ్ మోసం రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని తొలగించండి



పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షం నీరు

పోలవరం రూరల్: ఇటీవల కురిసన భారీ వర్షాలతో పోలవరం గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల ఆవరణలో వర్షం నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుల కొద్దీ వర్షం నీరు నిలిచిపోవడంతో దోమలు ఉధృతి పెరగుతుంది. నీరు రంగుమారి దుర్వాసన వస్తుందని, దీంతో విద్యార్థులు అనారోగ్యాల బారిన పడే పరిస్థితి ఉందని విద్యార్థుల తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో నిలిచిన నీటిని వెంటనే తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా వార్షికోత్సవం



వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: దేశ ఆర్థికాభివృద్ధిలో బ్యాంక్ ఆఫ్ ఇండియా గణనీయమైన కృషి చేస్తుందని బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్ ప్రసన్నలక్ష్మి అన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా 119 వ వార్షికోత్సవం పురస్కరించుకొని శుక్రవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన సేవల ద్వారా వ్యాపారాభివృద్ధి చేసుకుంటూ దేశంలో 5వ స్థానంలో కొనసాగుతుందన్నారు. స్థానిక బ్రాంచ్ ద్వారా ప్రజలకు ఎంతో చేరువ కాగలిగామని తెలిపారు. బ్యాంకు ద్వారా గృహ రుణాలు 8.40 శాతానికి, వాహన రుణాలు 8.84 శాతం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంతివెన్నెల, బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ వెంగల కోట్నీస్, నాగభూషణం, పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

పర్యావరణహిత మట్టి గణేశుడినే పూజిద్దాం



జంగారెడ్డిగూడెం: విద్యార్థులు తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలు



చింతలపూడి: వినాయక చవితికి మార్కెట్లో పత్రి అమ్ముతున్న వ్యాపారులు

- నేడు కొలువు తీరనున్న గణనాథులు
- ఏర్పాట్లు చేస్తున్న ఉత్సవ కమిటీలు

జంగారెడ్డిగూడెం: పర్యావరణహిత మట్టి విగ్రహాలనే పూజించాలని చత్రపతి శివాజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్‌బాబు అన్నారు. డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్రం, హార్టికల్చర్ విభాగాల నుంచి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రసాద్ బాబు అధ్యక్షతన పర్యావరణహిత వినాయక విగ్రహాల తయారీ, పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాస రావు, అధ్యాపకులు టి.ఝాన్సీరాణి, ఆర్.విజయ దీపిక, సీహెచ్. వెంకటలక్ష్మి, డాక్టర్ కె.ఉత్తమ్ సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

జంగారెడ్డిగూడెం: మట్టి వినాయకులను పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదాం అని మానవత సభ్యులు పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు అయినాల రమణమూర్తి ఆధ్వర్యంలో స్థానిక కొత్త బస్టాండ్ వద్ద ఉన్న వినాయకుడి గుడి వద్ద మట్టి వినాయక విగ్రహాల పంపిణీ నిర్వహించారు. మానవత సెక్రటరీ, సెంట్రల్ కమిటీ సభ్యులు మహంకాళి రంగ ప్రసాద్, మండల చైర్మన్ ఆకుల ధర్మరాజు, ఆత్మీయ సహకార కమిటీ గద్దె సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల: కొలువుతీరనున్న భారీ మట్టి వినాయక విగ్రహం

ఏర్పాట్లు పూర్తి

ద్వారకాతిరుమల: మండలంలో వాడవాడలా వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. ఒక్క ద్వారకాతిరుమలలోనే దాదాపు 12 ప్రాంతాల్లో ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు

వినాయక చవితి ఉత్సవాలను ఎవరికీ ఇబ్బంది కలగకుండా నిర్వహించాలని భీమడోలు సీఐ రవికుమార్, ఎస్సై టి.సుధీర్ ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు భీమడోలు సీఐ రవికుమార్ పోలీస్టేషన్ ఆవరణలో చవితి ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఇంకా ఎవరైనా అనుమతులు పొందాల్సి ఉంటే వాట్సాప్ నెంబర్ 7995095800కు హాయ్ అని మెజేస్ చేసి, అందులో వచ్చే ఫారం పూర్తి చేస్తే, అనుమతులు ఇస్తామన్నారు.



కామవరపుకోట: వినాయక మండపాన్ని పరిశీలిస్తున్న ఎస్సై చెన్నారావు



టి.నరసాపురం: ఉత్సవ కమిటీలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై జయబాబు

నిబంధనలు పాటించాలి

కామవరపుకోట: ఉత్సవ నిర్వాహకులు నిబంధనలు పాటించాలని తడికలపూడి ఎస్సై చెన్నారావు తెలిపారు. శుక్రవారం మండలంలో పలు వినాయక మండపాలను ఆయన పరిశీలించి, ఉత్సవ కమిటీ సభ్యులకు పలు సూచనలు ఇచ్చారు.

ఉత్సవ కమిటీలకు అవగాహన

టి.నరసాపురం: వినాయక చవితి ఉత్సవాలను నిబంధనల మేరకు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేసుకోవాలని ఎస్సై ఎం.జయబాబు అన్నారు. శుక్రవారం టి.నరసాపురం ప్రధాన సెంటర్‌లో ఫైర్ సిబ్బందితో కలిసి వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విగ్రహ ఏర్పాటుకు ఎటువంటి చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని, అనుమతి తీసుకుంటే చాలన్నారు.

చింతలపూడిలో చవితి సందడి

చింతలపూడి: వినాయక చవితి సందర్భంగా చింతలపూడి పట్టణంలో శుక్రవారం పండగ వాతావరణం నెలకొంది. చిన్న పిల్లల దగ్గర నుంచి పెద్దల వరకు ప్రతీ ఒక్కరూ ఎంతో ఇష్టంతో నిర్వహించే పండుగ వినాయక చవితి. పూజా సామాగ్రి కొనుగోలుకు భక్తులు బారులు తీరారు. మట్టి వినాయకుడి విగ్రహాల అమ్మకాలు జోరందుకున్నాయి. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలకు ఏర్పాట్లు చేసుకోవాలని సీఐ రవీంద్ర నాయక్ విజ్ఞప్తి చేశారు.

వృద్ధులకు కంటి పరీక్షలు



వృద్ధులకు నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న నేత్రవైద్యాధికారి ఎస్‌జీఎస్ శ్రీనివాస్

పోలవరం రూరల్: పోలవరంలోని గోదావరి నిలయం వృద్ధాశ్రమంలో వృద్ధులకు నేత్ర వైద్యాధికారి ఎస్‌జీఎస్ శ్రీనివాస్ కంటి పరీక్షలు నిర్వహించి, మందులు, కళ్లజోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్రదానంపై అవగా హన కల్పించారు. నేత్రదానం చేయడం వలన మరో వ్యక్తికి కంటి చూపు అందుతుందన్నారు. నిడదవోలు రాజరాజేశ్వరి కంటి ఆసుపత్రి, రాజమండ్రిలోని గౌతమి నేత్రాలయ నేత్ర సేవలు అందిస్తున్నారు.

వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ

ద్వారకాతిరుమల: వరద బాధితుల సహాయార్థం ద్వారకాతిరుమలకు చెందిన ఏపీఈపీడీసీఎల్ సీఎండీ యిమ్మడి పృథ్వీతేజ్ వెయ్యి దుప్పట్లను శుక్రవారం విజయవాడకు పంపారు. అక్కడ 21వ వార్డులో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు బాధితులకు వాటిని అందజేశారు.